## క్లుప్తంగా

### ఉరుకుందలో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

**కౌతాళం:** ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. మొక్క చెల్లింపులో భాగంగా కొందరు ప్రత్యేక అభిషేకాలు, పిండి వంటలు వండి స్వామి వారికి సమర్పించారు.

### 14లోపు పాఠశాలలో చేరాలి

**మంత్రాలయం:** మండలంలోని రచ్చమర్రి గ్రామ శివారులోనున్న ఏపీ మోడల్‌లో 2023–24వ విద్యా సంవత్సరం ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు ఈనె 14వ తేదీలోపు సంబంధిత ధ్రువ పత్రాలతో రావాలని ప్రిన్సిపాల్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా రాకపోతే రోస్టర్ నుంచి వారి పేరు తొలగించి వేరొకరికి సీటు కేటాయిస్తామని పేర్కొన్నారు.

### వైభవంగా ఆరాధనోత్సవం

**మంత్రాలయం రూరల్:** మండలంలోని చెట్నేహళ్లిలో వెలసిన భీమరాయతాత ఆరాధనోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం తాత సమాధికి విశేష అభిషేకాలు చేపట్టిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతతో సుందరంగా అలంకరించారు. తాత చిత్రపటాన్ని దేవర ఇంటి నుంచి గ్రామ వీధుల్లో ఊరేగించి సమాధికి చేర్చారు. సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### 14నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

**కోసిగి:** ఈనెల 14వ తేదీ నుంచి మండలంలోని మూగలదొడ్డి గ్రామంలో మొహర్రం సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిల సహకారంతో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అశోక్, సురేష్, తిరుమల తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ విజేతలకు వరుసగా రూ. 15వేలు, రూ.10వేల నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. ఈనెల 13వ తేదీ లోపు రూ.వెయ్యి ప్రవేశ రుసుము చెల్లించి జట్లు పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకుసెల్ 8555931736, 9019231411 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### చెరువును స్వాధీనం చేసుకోండి

**ఆదోని రూరల్ :** మండలంలోని పాండవగల్లు గ్రామంలోని ప్రభుత్వ పెద్ద చెరువుపై కోర్టులో ఉన్న స్టే ఆర్డర్ రద్దు అయ్యిందని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని పెద్ద చెరువు సాధన కమిటీ కన్వీనర్ యం.తాహెర్‌వలి, వెంకటేష్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్ద చెరువును కొన్ని సంవత్సరాలుగా ఆక్రమించుకోగా.. ప్రజలు కోర్టులను ఆశ్రయించగా ప్రజలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినా అక్రమార్కులు ఆదోని డివిజన్ కోర్టు, కర్నూలు జిల్లా కోర్టు తీర్పులను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసు వేసి తనకు అనుకూలంగా తెచ్చుకున్న స్టే ఆర్డర్‌ను హైకోర్టు రద్దు చేసిందని చెప్పారు. వెంటనే చెరువును అధికారులు స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్ విచారణ చేపడతామని హామీ ఇచ్చారు.

### 16న ఉచిత కంటి వైద్య శిబిరం

**కౌతాళం:** ఈనెల 16వ తేదీన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కర్నూల్ అమీలియో హాస్పిటల్ వైద్యులు పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని వారు కోరారు.

### విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

**ఆలూరు:** హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామానికి చెందిన కోడుమూరు బసవరాజ్ (30) సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నిట్రవట్టి గ్రామానికి చెందిన లేట్ కోడుమూరు మల్లికార్జునగౌడు, బసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు బసవరాజ్ సోమవారం ఉదయం పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లారు. విద్యుత్ మోటారు కనెక్షన్ లూజు కావడంతో స్టార్టర్‌ను ఆన్ చేసేందుకు ప్రయతి్నంచగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, మండల కన్వీనర్ వీరేష్ సంతాపం తెలిపారు.

# వ్యాధులతో జాగ్రత్త

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా జంతువు ప్రాణానికి ప్రమాదం
- జాగ్రత్తలతో పాటు నివారణ చర్యలు పాటించాలి
- అత్యవసర సమయంలో 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వైద్య సేవలు

**ఆదోని డివిజన్‌లో పశువుల వివరాలు..**

| | |
|---|---|
| ఆవులు, ఎద్దులు | - 1.20 లక్షలు |
| బర్రెలు | - 80 వేలు |
| గొర్రెలు, మేకలు | - 5.84 లక్షలు |

**ఆదోని సెంట్రల్ :** వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పశువులకు ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమే అయినా తీవ్ర ప్రభావం చూపుతాయి. పెంపకందారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జీవి ప్రాణానికే ప్రమాదం వాటిల్లవచ్చు. పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధి సోకినట్లు అనుమానంగా ఉంటే సమీపంలోని పశువైద్యశాలలోని వైద్యులను సంప్రదించాలి, ఒక వేళ పశువు లేదా జీవం పరిస్థితి సీరియస్ ఉన్నా, అసుపత్రికి తరలించలేని పరిస్థితి ఉంటే వెంటనే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా వాహనంతో వైద్యులు వచ్చి చికిత్స చేసి ప్రాణిని కాపాడతారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశువైద్యశాలకు తరలిస్తారు.

**గాలి కుంటు వ్యాధి..**

గాలికుంటు వ్యాధి అవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. వ్యాధిబారిన పశువుకు 104 నుంచి 105 డిగ్రీలకు ఉష్ణోగ్రత పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. అహారం సరిగా తినవు. దీంతో నీరసంగా మారి నడవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యంటిబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

**జలగ వ్యాధి..**

మురుగునీరు, క్యాలల్లో నీరు తాగడం వల్ల ఈ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులకు దవడ కింద నీరు చేరుతుంది. అలాగే పొట్ట కింద కూడా నీరు చేరే అవకాశం ఉంది. వ్యాధి సోకిన పశువులు మేత తినడంలో ఇబ్బందులు పడుతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీలీటర్ల నీయోజాడ ప్లస్‌ను అందించాలి.

**నట్టల వ్యాధి..**

.గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగులు సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులు తినేయడం వల్ల గొర్రె రోగాలు బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చి మేత పెరుగుతూ ఉంటుంది.అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత చర్యలుగా అరు నెలలు ఒకసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది. ఈ ఏడాది కూడా నట్టల నివారణ మందులు వేశారు.

**గొంతు వాపు వ్యాధి..**


మదిరేలో ఎద్దుకు చికిత్స చేస్తున్న వైద్యులు (ఫైల్)

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో ఈ వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ కారుస్తుండడం, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్,జూలై నెలల్లో (హెచ్‌ఎస్) టీకాలు వేస్తారు.. వ్యాధి బారినపడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

**చిటుకు వ్యాధి..**

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వస్తుంటుంది. చిటుకు వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూన్, జూలై మాసంలో ఇటాస్ అనే వ్యాక్సిన్ వేస్తారు. రైతులు వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్యం అందించడం వలన వ్యాధులను నివారించవచ్చు.


నాగులాపురం వద్ద గొర్రెలకు నట్టల నివారణ మందులు వేస్తున్న డాక్టర్లు.(ఫైల్)

**పశువైద్యులను సంప్రదించండి**



నట్టల నివారణ మందులను అరు మాసాలకు ఒకసారి గొర్రెలకు వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తాం. పశువ్యాధుల పట్ల సందేహాలుంటే స్థానికంగా ఉన్న పశువైద్య కేంద్రాల్లో పశు వైద్యులను సంప్రదించి తగు జాగ్రతలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితిలో 1962కు కాల్ చేస్తే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు అరోగ్య సేవా వాహనం, సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తారు. డివిజన్‌లో 2 లక్షల వరకు పశువులు ఉన్నాయి. ఒకసారి ఏదేని వ్యాక్సిన్ వేసినా ఆరు నెలల వరకు దాని ప్రభావం ఉంటుంది. గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేస్తాం, ఇప్పటికే ఏప్రిల్, మే నెలల్లో ఒక డోసు వేశాం. మరోసారి షెడ్యూల్ ప్రకారం పశువులకు ఉచితంగా టీకాలు వేస్తాం.

– పివి.రమణ, ఉప వైద్యాధికారి, పశువైద్యశాఖ

## సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురండి

**ఆదోని టౌన్ :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆస్తి పన్ను విధింపు, కొత్తగా విధించాలని కొందరు, వేళకు తాగునీటి సరఫరా చేయాలని మరో ఇద్దరు అర్జీలు అందజేశారు. వీధిలైట్లు వెలగని వాటి స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని ఒకరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, టీపీఓ, శానిటేషన్, రెవెన్యూ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

## మొక్కల పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

**కౌతాళం:** ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన మొక్కలను ఎంపీడీఓ సుబ్బారాజు సోమవారం ఏపీఓ జుబేర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గోదావరి జిల్లా కడియం నర్సరీ నుంచి వచ్చిన మొక్కల్ని ఆయా గ్రామాల రైతులకు పంపిణీ చేశామన్నారు. 6,200 కొబ్బరి మొక్కలు, 610 జామూన్ మొక్కలను మండల కేంద్రానికి చెందిన రైతులతో పాటు ఏరిగేరి, ఉరుకుంద, హాల్వి, మల్లన్నహట్టి, గొతులదొడ్డి, పొదలకుంట గ్రామాల రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎకరాకు 40 మొక్కల చొప్పన 89 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. కొబ్బరి మొక్కలను పొలాల గట్ల వెంట నాటుకోవాలని, జామ మొక్కలను పొలం మధ్యనే నాటుకోవచ్చన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ రఫీ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే స్పందన ధ్యేయం

- అర్జీలను శనివారం లోపు పరిష్కరించాలి
- సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్


స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

**ఆదోని రూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్‌సింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమస్యల్లో కొన్ని..**

- ఆదోని మండలం సాదాపురం గ్రామానికి చెందిన మల్లికార్జునకు సర్వే నంబర్ 131లో 12.64 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో 1.32 ఎకరాల భూమి వేరే వారి పేరున నమోదైందని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.
- మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన పోతురాజు చిన్న ఈరన్నకు సర్వే నంబర్ 107/బీలోని 0.95 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వాలని అర్జీ సమర్పించారు.
- కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి చెందిన హరిజన రమేష్‌కు సర్వే నంబర్ 482లో 46 సెంట్లు భూమి కొనుగోలు చేశానని, ఈ భూమిని ఆన్‌లైన్‌లో తన పేరున నమోదు చేయాలని విన్నవించారు.
- కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన రామాంజనేయులకు సర్వే నంబర్ 103/ఏలోని 97 సెంట్లు భూమి ఉందని, ప్రస్తుతం ఆ పొలానికి రస్తా ఇవ్వకుండా బెదిరిస్తున్నారని, తన పొలానికి రస్తా చూపించాలని అర్జీ అందజేశారు.
- ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డికి సర్వే నంబర్ 212/సీ1లో 1.99 ఎకరాలు, 212/సీ3లోని 11.59 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం 5.29 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుమీద నమోదై ఉందని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశాడు.

## జోరుగా ఇళ్ల నిర్మాణాలు


పనులు చేస్తున్న కూలీలు

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మొదటి దశలో 5,957 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 482 ఇళ్లు పూర్తి కాగా, రూఫ్ లెవల్‌లో 65, బేస్‌మట్టంలో 1,829 ఇళ్లు ఉన్నాయి. 3,569 ఇళ్లు వివిధ దశలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు ఇళ్లను పూర్తి చేయాలని పనులను వేగంగా చేస్తున్నారు. ఇందుకు అక్కడ ఇటుకలను తయారు చేస్తున్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్‌కు కొరత లేకుండా చూస్తున్నారు.తాగునీరు, అంతర్గత రహదారులు,విద్యుత్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. లేబర్ సమస్యతో పనులు కొంత అలస్యమవుతున్నాయని, అయినా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హౌసింగ్ డీఈ ఎం.రవికుమార్ తెలిపారు.

# హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి


సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఆదోని రూరల్ :** పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలని సోమ వారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భరత్, శ్రీనివాసులు మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థినులకు ఉడకని అన్నం పెడుతున్నారని, మెనూ పాటించడం లేదని, నాలుగు రోజులుగా కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారని, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు గణేష్, నాగరాజు, రామస్వామి, గౌస్ పాల్గొన్నారు. అలాగే..ఆరేకల్ మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలకు తాగునీటి వసతిని కల్పించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు క్రిష్ణ, ఖాజా కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాలలో త్రీవమైన నీటి ఎద్దడి నెలకొందని, గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో సుమారు వెయ్యి మందికి పైగా బాలికలు వివిధ జిల్లాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారన్నారు. సుభాన్, శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆరు సంవత్సరాల నుంచి పేరుకు మాత్రమే కొనసాగుతున్న గాయత్రీ ప్రైవేట్ ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్ల కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు.సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదోని ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు కనీస మౌలిక వసదుపాయాలు కూడా లేవన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ మూలన పడేయడంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

# మామపై అల్లుడి దాడి- కేసు నమోదు

**ఆదోని రూరల్ :** కపటి గ్రామానికి చెందిన తలారి కడబూరయ్యపై అదే గ్రామానికి చెందిన అల్లుడు ఈరన్నతో పాటు మరొక వ్యక్తి దాడి చేసి గా యపరిచారని ఇస్వీ హెడ్‌కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ సోమవారం తెలిపారు. దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

# పేదల అభ్యున్నతికి పెద్దపీట

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- ఐరన్‌గల్లులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

**కోసిగి :** పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జంపాపురం సచివాలయం పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, ఎంత మేర లబ్ధి పొందారు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలన ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని, బురదజల్లే రాజకీయాలకు తెరతీశారని మండిపడ్డారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఇళ్లు కట్టుకునే వారికి పెండింగ్‌లో లేకుండా బిల్లులు వెంటనే చేయాలని హౌసింగ్ డీఈ లాలీ కృష్ణయ్యకు సూచించారు. అనంతరం జంపాపురం గ్రామంలో సచివాలయ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని, నిత్యం అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఐరన్‌గల్లు రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైలును నిలపాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు,మాణిక్యరాజు, జగదీష్ స్వామి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు బుళ్లి నరసింహులు, మల్లికార్జున గౌడ, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఉస్మాన్, సోఫి, సర్పంచ్ రామాంజనేయులు, దొడ్డి నరసన్న,హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు, ఏపీఎం సత్యమ్మ, నాయకులు శ్రీరాములు, బీమా సేనా,సోమప్ప పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### కేసు నమోదు

**మంత్రాలయం:** శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన గంగారాజ్ తన భార్య రాధతో కలిసి గత నెల 25న మంత్రాలయం వచ్చారు. వీరు స్వామి వారి దర్శనం అనంతరం తిరిగి సొంతూరికి వెళ్లేందుకు కాలినడకన ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తుండగా ఉడిపికి చెందిన సంతోష్‌కుమారు శెట్టి తన కారుతో రాధను ఢీకొట్టాడు. దీంతో ఆమెకు కాలు విరిగింది. అత్యవసరం కావడంతో సొంతూరికి వెళ్లి చికిత్స అంతనం సోమవారం మంత్రాలయం చేరుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం పోలీసులు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**మంత్రాలయం రూరల్:** ఆదోని మండలం జాలమంచి గ్రామానికి చెందిన గవిగట్టు మునీంద్రమ్మ 192 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను విక్రయించేందుకు తరలిస్తుండగా మాధవరంలో సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు. మహిళా కానిస్టేబుల్ నిర్మల పాల్గొన్నారు.

### ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి


అంజినయ్య (ఫైల్)

**కౌతాళం:** బదినేహాల్ గ్రామంలో ఘర్షణలో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఈనెల 4వ తేదీన గ్రామంలో రాత్రి చర్చి వద్దనున్న ఖాళీ స్థలంలో అంజినయ్య ట్రాక్టర్‌ను నిలపడానికి వెళ్లగా అక్కడ నారయణ, శివప్ప, రాఘవేంద్ర బహిర్భూమికి వచ్చారు. తాను ఇక్కడ ట్రాక్టర్ వదులుతానని ఇలాంటివి చేయొద్దని అంజినయ్య సూచించాడు అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు రామకృష్ణ, ఉరుకుందు, వెంకటేష్‌ను తీసుకుని అంజినేయ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో అంజినయ్యతో పాటు అతని కుమారులు వీరేష్, వెంకటేష్ గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం బంధువులు ఆదోనికి తరలించారు. అంజినయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అంజినయ్యకు భార్య గోవిందమ్మ,ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

# పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి


చిన్నతుంబళంలో మాట్లాడుతున్న వలంటీర్లు

**పెద్దకడబూరు :** వలంటీర్లపై నీచంగా మాట్లాడిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు కమ్మరి బ్రహ్మయ్య, బి.సునీల్, బి.చిన్న ఈరన్న డిమాండ్ చేశారు. జనసేన అధ్యక్షుడు వలంటీర్లపై చేసిన వాఖ్యలపై వారు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరోన వంటి కష్ట కాలంలో రాష్ట్ర ప్రజలకు వలంటీర్లు చేసిన సేవల అమోఘమైనవని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఇలాంటివి తెలుసుకోకుండా గాలి మాటలు మాట్లాడడం తగదన్నారు.

# కుమార్తెను అప్పగించాలని ఆందోళన


టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన ఖాదర్‌బాషా, కుటుంబ సభ్యులు

**ఆదోని టౌన్ :** తన కుమార్తెను అప్పగించాలని తల్లిదండ్రులు పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ శ్రీనివాస నాయక్ తెలిపిన వివరాల మేరకు.. పరిషముల్లా వీధికి చెందిన ఖాదర్ మూడేళ్ల క్రితం తన కూమార్తెను అన్న హాజీబాషాకు దత్తత ఇచ్చాడు. అయితే ఇటీవల ఇద్దరి మధ్య కుటుంబ, ఆస్తి గొడవలు తలెత్తాయి. దీంతో తన కూమార్తెను తిరిగి ఇవ్వాలని అన్న హాజీతో పలుమార్లు గొడవపడ్డాడు. అయితే అందుకు ఆయన అంగీకరించకపోవడంతో సోమవారం ఖాదర్, భార్య, ముగ్గురు కుమార్తెలతో కలిసి టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో స్టేషన్ వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇద్దరి వాదనలు విని న్యాయం చేస్తామని సీఐ చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పూజలందుకుంటున్న షేక్షావలి తాత


దర్శనం కోసం దర్గా వద్ద బారులుదీరిన ప్రజలు

# ఘనంగా షేక్షావలితాత ఉరుసు

**ఆదోని రూరల్:** మండలంలోని సుల్తానపురం గ్రామంలో వెలిసిన షేక్షావలి దర్గాలో సోమవారం రాత్రి ఉరుసును ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం రాత్రి గంధం, సోమవారం ఉరుసు ఘనంగా జరిగినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మంగళవారం జియారత్ కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయని చెప్పారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో రాత్రి పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు.